


రూ.2 కోట్ల విలువైన ఎర్రచందనం స్వాధీనం

- అంతర్రాష్ట్ర స్మగ్లర్ల ముఠా అరెస్టు : ఎస్‌పి
- కాన్వాయ్ తరహాలో దుంగలు తరలింపు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

ఎర్రచందనం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపి, ఎక్కడికక్కడ నిఘా ఉంచి జాతీయ సంపదను కాపాడుతున్నామని ఎస్‌పి పి.పరమేశ్వరరెడ్డి చెప్పారు. ఈ నేపథ్యంలో 2 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు, వాహనాలు స్వాధీనం చేసుకున్నామని, అంతరాష్ట్ర స్మగ్లర్ల ముఠాకు సంబంధించి 9 మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. తిరుపతి పోలీసు కార్యాలయంలో విలేకరులతో ఎస్‌పి మాట్లాడుతూ సరిహద్దు చెక్‌పోస్టుల్లో సిసి కెమెరాలను ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశామన్నారు. చంద్రగిరి సబ్ డివిజన్ డిఎస్‌పి టిడి యశ్వంత్‌కు అందిన సమాచారం ఆధారంగా శుక్రవారం సాయంత్రం భాకరాపేట సిఐ తులసిరామ్, ఎస్‌ఐలు కలిసి యర్రావారిపాలెం మండలం యల్లమంద- ఉస్తికాయలపెంట రోడ్డులో యల్లమంద క్రాస్ వద్ద నిఘా ఉంచారు. అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేశారు. ఇంతలోనే అప్రమత్తమైన ఓ వాహనం తప్పించుకునే ప్రయత్నం చేయడంతో సిఐ తన సిబ్బందితో చుట్టుముట్టి చాకచక్యంగా 9 మంది స్మగ్లర్లను, మూడు ఇన్నోవా కార్లు, ఒక హ్యూండై కారు, ఒక బెలెరో పిక్ అప్ వాహనం, ఒక మోటార్ సైకిల్, 33



ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. సరుకుని శేషాచల అడవి ప్రాంతం నుంచి వేలూరుకు పంపుతున్నట్లు తెలిసింది. రెండు వేర్వేరు ముఠాలకు చెందిన స్మగ్లర్లు తరలింపుకు కలిసి పనిచేసినట్లు సమాచారం. ద్విచక్రవాహనం, కారు పైలెట్‌గా ముందు వెళితే మిగిలిన వాహనాల్లో ఎర్రచందనం దుంగలను ఉంచుకుని కాన్వాయ్‌లా ఏర్పడి తరలింపు చేస్తున్నట్లు వెల్లడించారు. తమిళనాడు, కర్నాటక, కేరళ రాష్ట్రాల్లోనూ వీరిపై ఏమైనా కేసులు ఉన్నాయా అని విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.

అరెస్టయిన ముద్దాయిల వివరాలు

1. ఎం.మధురై (59), క్రిష్ణగిరి జిల్లా, తమిళనాడు 2. సి.గోవిందస్వామి (49), సేలం జిల్లా, తమిళనాడు 3. ఎ.జైగణేష్ (40), సేలం జిల్లా, తమిళనాడు 4. సి.అన్నామలై (35), సేలం జిల్లా, తమిళనాడు 5. ఎం.రమేష్ (45), కోలార్ టౌన్, కర్నాటక 6. ఎంఎస్ షరాఫుద్దీన్ (30), త్రిసూర్ జిల్లా, కేరళ 7. ఎం.సబీక్ (45), పాలకడ్ జిల్లా, కేరళ, 8. శ్రీరజ్ (36), పాలకడ్ జిల్లా, కేరళ 9. ఎస్.బాబు (36), పాలకడ్ జిల్లా, కేరళ.

సిబ్బందికి అభినందనలు

కేసు ఛేదనలో ఉత్తమ ప్రతిభ కనబరచిన భాకరాపేట సర్కిల్ అధికారులు, సిబ్బంది సిఐ ఎం.తులసీరాం, ఎస్‌ఐలు ఎం.వెంకటేశ్వర్లు, జి.ప్రకాష్‌కుమార్, సిబ్బంది కోదండ రామిరెడ్డి చెట్టి, ఎం.గోవిందయ్య, కె.చలపతి, ఎస్.గోపి, బి.దేవేంద్రనాయక్, కె.నరేంద్ర, ఎం.సుబ్రమణ్యం, టిజి సునీల్‌కుమార్, ఎం.ప్రసాద్, జి.రాజేష్, బి.వెంకట కిషోర్, బాలసుబ్రమణ్యం, ఎన్.శ్రీకాంత్, ఎస్.విజయ, వి.చంద్రశేఖర ఉన్నారు.



దేసూరికండ్రిగ ఎస్సీ కాలనీలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి

ఇంటింటికీ జగనన్న సురక్షపై అవగాహన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రతి వాలంటీర్ తమ క్లస్టర్ పరిధిలోని ఇంటింటికీ వెళ్లి జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించి, ప్రజలకు అవసరమైన సర్టిఫికెట్స్ ఇప్పించేందుకు సహాయపడాలని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 42వ డివిజన్ రామచంద్రానగర్ ఏరియాలో సచివాలయ సిబ్బంది జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఏవిధంగ చేపడుతున్నారని కమిషనర్ హరిత వెళ్లి స్వయంగా పరిశీలించారు. ప్రతి ఇంటికి వెళ్ళి వారితో మాట్లాడిన తరువాత వారి ఫొటో ఖచ్చితంగా అప్లోడ్ చేయాలని తెలియజేసారు. కమిషనర్ వెంట డి.ఎఫ్.ఓ. శ్రీనివాసరావు ఉన్నారు.

వాలంటీర్ రోహిణికి అభినందనలు

రామచంద్రాపురం మండలం దేసూరి కండ్రిగ ఎస్‌సి కాలనీలో జగనన్న సురక్ష సర్వే విధానాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. వాలంటీర్ రోహిణిని అభినందించారు. కొత్త స్కూలు కావాలని గ్రామస్తులు కోరారు. ప్రతిపాదనలు పంపాలని ఎంపిడిఒకు సూచించారు. బడికి వెళ్లని పిల్లలు ఉన్నారా? అని అడగ్గా అందరూ వెళుతున్నారని సమాధానమిచ్చారు. అక్కడే ఉన్న చిన్నపిల్లలతో ముచ్చటించారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ రఫీ, సెక్రటరీలు భువనేశ్వరి, శశికుమార్, డిఎల్‌డిఒ సుశీలదేవి పాల్గొన్నారు.



ఏడాదిగా అందని వేతనాలు

'హరిత రాయబారుల' ఆవేదన

ప్రజాశక్తి -శ్రీకాళహస్తి రూరల్

గ్రామాల్లో పారిశుద్ధ్యం సక్రమంగా ఉండాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్, స్వచ్ఛభారత్ వంటివి సక్రమంగా అమలుకు నోచుకోవాలంటే హరిత రాయబారులు కష్టించి పనిచేస్తున్నారు. కాబట్టి కరోనా వంటి కష్టమైన కాలంలో ప్రజలు ఇంటి నుంచి బయటికి రావడానికి భయపడిన రోజుల్లోనూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేసిన గొప్ప వ్యక్తులు ఎవరైనా ఉన్నారంటే హరిత రాయబారులే అని చెప్పాలి. ఇటువంటి వారికి నెల, నెల జీతాలు అందించలేని పరిస్థితుల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయంటే ఎటువంటి వారికైనా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది.

విషయంలోకి వెళితే... మండలంలో మొత్తం 46 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీలకు గాను 103 మంది హరిత రాయబారులు పనిచేస్తున్నారు. పంచాయతీలో 2000 మంది జనాభా కలిగి ఉంటే ఇద్దరు హరిత రాయబారులను, 1000 మంది జనాభా కలిగి ఉంటే ఒక హరిత రాయబారిని ప్రభుత్వం నియమించింది. వీరు ప్రతిరోజూ వారి వారి పరిధిలో ఉన్న చెత్తను సేకరించి ఆ పంచాయతీలో ఉన్న చెత్త నుండి సంపద కేంద్రాలకు తరలిస్తుంటారు. గ్రామాల్లో పారిశుధ్యం కోసం ఇంత శ్రమిస్తున్న వీరికి ప్రభుత్వం నుంచి అందే వేతనం తక్కువలో తక్కువ ఒక నెలకి ఆరువేల రూపాయలు మాత్రమే. ఈ ఆరువేలైనా నెలనెలా అందే పరిస్థితి లేదు. వీరికి జీతాలు అంది ఇంచుమించు ఏడాది అవుతోంది. గత సంవత్సరం స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా 2022, మే మాసం వరకు వీరికి జీతాలు అందాయి. తరువాత కేంద్ర ప్రభుత్వం హరితరాయ బారుల వేతనాల విషయం రాష్ట్ర ప్రభుత్వానికే బాధ్యత ఒప్పించింది. దీంతో గతంలో పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి హరిత రాయబారులకు ఆరు నెలల వేతనాన్ని అందించాలని ప్రభుత్వం పేర్కొనడంతో పంచాయతీకి వచ్చిన నిధులను బట్టి ఒక్కొక్క పంచాయతీ ఒక్కొక్క విధంగా హరిత రాయబార్లకు జీతాలు చెల్లించారు. అయినప్పటికీ పూర్తిస్థాయిలో ఇంకా సుమారు ఒక సంవత్సర కాలం వేతన బకాయిలు ఉండటంతో హరిత రాయబారులు ఎలా బతకాలో అర్థం కాక కుటుంబ పోషణ కోసం అందిన కాడల్లా వడ్డీలకు అప్పులు చేసి వారికి నెలనెలా వడ్డీలు కట్టలేక అల్లాడిపోతున్నామని ఆవేదన చెందుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హరితరాయబారులకు బకాయి వేతనాలు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఏడాదిగా వేతనాల్లేవు

గోపాల్, హరిత రాయబారి



సంవత్సరం కాలంగా జీతాలు అందక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. నిత్యవసర సరుకుల కోసం కిరాణా షాపుల్లో అప్పులు చేసి బతకాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి మాకు రావలసిన జీతాలు తొందరగా ఇప్పించాలని కోరుతున్నాం.

బకాయి ఉన్నమాట వాస్తవమే

పఠాన్ రఫీ, ఎంపిడిఒ




హరిత రాయబారులకు జీతాల బకాయి ఉన్న మాట వాస్తవమే. పంచాయతీల్లో అందుబాటులో ఉన్న నిధులను పరిశీలించి ఆయా పంచాయతీలపరిధిలో ఉన్న హరిత రాయబారులకు బకాయి వేతనాలను తొందర్లోనే చెల్లించే ఏర్పాట్లు చేస్తాం.

ధర్మమే గెలిచింది..! : బార్ అసోసియేషన్ అధ్యక్షులు పొన్నేపల్లి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దొడ్డి దారిన శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిని నియమిస్తూ ఏపీ బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర అత్యున్నత ధర్మాసనం తప్పు పట్టడమే కాకుండా స్టే విధించడం హర్షణీయమనీ, చివరకు ధర్మమే గెలించిందని న్యాయవాది, శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పొన్నేపల్లి వెంకటాచలపతి అన్నారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ గత ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధంగా జరిగాయన్నారు. 2020-21 ఏడాదికి బార్ అధ్యక్షుడిగా ఎన్నికైన ఓ న్యాయవాది 2022-23 ఏడాదిలో ఎన్నికలు నిర్వహించకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు. అదే పంథాను 2023-24 ఎన్నికల్లో కూడా కొనసాగించే అవకాశం ఉండడంతో తాను ఎన్నికలు జరపాలని ఏపీ బార్ కౌన్సిల్ కు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. స్పందించిన బార్ కౌన్సిల్ ఈ ఏడాది మార్చిలో ఎన్నికలు జరపాల్సిందిగా సూచిస్తూ లాయర్ సురేంద్ర బాబును ఎన్నికల అధికారిగా నియమించిందని గుర్తు చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకారం తమ ఫ్యానెల్ సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారని తెలిపారు. అయితే మాజీ ప్రెసిడెంట్ వర్గం నుంచి ఒక్కరు కూడా నామినేషన్ దాఖలు చేయకపోవడంతో తాను శ్రీకాళహస్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు ధ్రువీకరిస్తూ ఎన్నికల అధికారి సురేంద్ర బాబు మార్చి 27న నియామక పత్రం అందించారని చెప్పారు. అయితే మాజీ ప్రెసిడెంట్ మా నియామకం చెల్లదనీ, ప్రెసిడెంట్ గా ఆయనే కొనసాగాలంటూ ఏపీ బార్ కౌన్సిల్ కు ఫిర్యాదు చేశాడని చెప్పారు. ఏపీ బార్ కౌన్సిల్ ఆయనకు అనుకూలంగా ఉత్తర్వులు జారీ చేసిందని వాపోయారు. దీంతో బార్ కౌన్సిల్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ తాము రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానంలో రిట్ ఫిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. విచారణ జరిపిన హై కోర్టు ఏపీ బార్ కౌన్సిల్ తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబడుతూ స్టే విధించిందన్నారు. తద్వారా న్యాయబద్ధంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన తనకు అవకాశం దక్కడం ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పుతో చివరకు ధర్మమే గెలిచిందని కొనియాడారు. న్యాయవాది ఏ. బాలాజీ పాల్గొన్నారు.







గూడూరు, సూళ్లూరుపేటల్లో...

పసిడి ప్రియులకు 'లలిత జ్యువెలరీ' శుభవార్త

ప్రజాశక్తి-సూళ్లూరుపేట/ గూడూరు

నాణ్యమైన నగలు, సరసమైన ధరలతో సామాన్యులకు అందుబాటులో ఉండే విదంగా ప్రజల ఆదరాభిమానాలు అందుకుంటున్న పేరుగాంచిన లలిత జ్యూవెలరీ సూళ్లూరుపేట పట్టణంలో అందుబాటులోకి వచ్చింది, జి ఎన్ టి రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన లలిత జ్యూవెలరీ షోరూమ్ ను శనివారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చేతులు మీదుగా ప్రారంభించారు. లలిత జ్యూవెలరీ ఎండి డాక్టరు.ఎం కిరణ్ కుమార్ నేతత్వంలో జరిగిన ప్రారంభోత్సవంలో భాగంగా జ్యోతి ప్రజ్వలనం జరిగింది. ఈ సందర్భంగా ఎండి కిరణ్ కుమార్ మాట్లాడుతూ డబ్బులు ఎవరికీ ఊరికే రావని, ప్రతి పైసాకూ విలువ కట్టి నాణ్యమైన నగలను ఖాతాదారులకు అందించడమే లలిత జ్యూవెలరీ లక్ష్యమని అన్నారు. ఇది 48 వ షో రూమ్ అయితే, గూడూరులో 49 వ షోరూం, నెల్లూరు లో 50 వ షోరూం ఒకే రోజు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలియజేసారు. ఈ సందర్భముగా కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ సూళ్లూరుపేట ప్రాంతవాసులు ఇకపై నగలు కొనడానికి నెల్లూరు, చెన్నై వెళ్లాల్సిన అవసరం లేదని ఇక్కడే లలిత జ్యూవెలరీ లాంటి షోరూంలు అందుబాటులోకి రావడం శుభపరిణామమని ఆయన అన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, మునిసిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్లు చిన్ని సత్యనారాయణ, పోలూరు పద్మ, కౌన్సిలర్లు మిజురు రామకష్ణ రెడ్డి, పముజుల విజయలక్ష్మి, సన్నారెడ్డి సౌజన్య, ఈదురు చెంగమ్మ, వైసీపీ నేతలు జెట్టి వేణు యాదవ్, తుపాకుల ప్రసాద్, ఐతా శ్రీధర్, గోగులు తిరుపాల్, కాకి శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట, గూడూరు, నెల్లూరుల్లో ప్రారంభం

గూడూరులో... ఎంఎల్ఎ వెలగపల్లి వరప్రసాద్‌రావు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ, జ్యూవెలరీ అధినేత కిరణ్‌కుమార్ జ్యోతి ప్రజ్వలనం చేశారు. బంగారు, వెండి వస్తువులను తిలకించారు. నాయకులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్యామలరావును కలిసిన మహిళా వర్సిటీ వీసీ భారతి



క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నూతనంగా పదవీ బాధ్యతలను స్వీకరించిన ఆచార్య డి. భారతి శనివారం ఉదయం విజయవాడలో ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జె.శ్యామలరావుని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి తనపై నమ్మకంతో ఉపకులపతి బాధ్యతలను ఇచ్చినందున కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉపకులపతిని వారు యూనివర్సిటీని అన్ని విధాలుగా ముందంజలో తీసుకెళ్లాలని సూచించారు.

నేడు మంగళంలో మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం): మంగళం పరిధిలోని బిటిఆర్ కాలనీలో ఆదివారం ఉదయం ఇండియన్ మెడికల్ అసోసియేషన్, ప్రజాశక్తి దినపత్రిక సంయుక్తంగా నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపును స్థానిక ప్రజలు విని యోగించుకోవాలని నిర్వాహకులు కోరారు. మంగళం పరిధిలోని బీటీ రణదేవ్ కాలనీలో ప్రజాశక్తి ఆధ్వర్యంలో ఇండియన్ మెడికల్ సౌజన్యంతో నిర్వహింపబడుతున్న మెగా మెడికల్ క్యాంపులో ప్రజలు పాల్గొని ఉచితంగా వైద్యసేవలు పొందాలని నిర్వాహకులు కోరారు. మెడికల్ క్యాంపులో మధుమేహం, రక్త పోటు ఇలా పలు అనారోగ్య సమస్యలకు వైద్యుల సలహా మేరకు ఉచిత మందులు ఇవ్వబడుతాయని తెలిపారు. స్థానిక ప్రజలు ఉచిత మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు.




ఉచిత వైద్యశిబిరంపై ప్రచారం చేసున్న 'ప్రజాశక్తి' సిబ్బంది

నెల నెలా కరెంట్ షాక్..!!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జగన్మోహన్ రెడ్డి పాలనలో సామాన్యుడికి నెల నెలా కరెంట్ షాక్ తగులుతోందని సిపిఎం నియోజకవర్గ ఇన్చార్జి అంగేరి పుల్లయ్య విమర్శించారు. కరెంట్ బిల్లులతో జనాలకు షాక్ కార్యక్రమంలో భాగంగా శనివారం సిపిఎం నాయకులు పట్టణంలోని దక్షిణ కైలాస నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా నెల నెల వినియోగదారులకు వస్తున్న కరెంటు బిల్లును చూసి షాక్ అయ్యారు. ధనపాల్(సర్వీసు నంబర్: 5432200019715) అనే వ్యక్తికి మార్చి లో రూ.632 బిల్లు రాగా, ఏప్రిల్ లో రూ.923, మేలో రూ.1961, జూన్ లో రూ.2282 బిల్లు వచ్చిందని వాపోయారు. ప్రజల కళ్ళు గప్పి దొడ్డి దారిన సర్దుబాటు చార్జీల భారం మోపడం వల్లే సామాన్యులపై నెల నెలా కరెంటు చార్జీలు పెరిగిపోతున్నాయని పుల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ సర్కార్ కేంద్రానికి తలొగ్గి, కార్పొరేట్లకు కొమ్ముకాస్తుండటం వల్లే కరెంట్ బిల్లులు షాక్ కొడుతున్నాయని మండిపడ్డారు. త్వరలో స్మార్ట్ మీటర్లు రాబోతున్నాయనీ, ప్రజలు ప్రతిఘటించకుంటే చిమ్మ చీకట్లు తప్పవని హెచ్చరించారు. గంధం మణి, కుమార్, వెంకటేష్, వెలివేంద్రం పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో బిల్లుల పరిశీలన

అగ్ని ప్రమాదంలోనూ... 'ఆగమమే'..!

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

మానవతప్పిదం వల్లనో...సాంకేతిక సమస్యల వల్లనో కొన్ని ప్రమాదాలు సంభవించడం సహజం. అందులో కూడా ఆగమశాస్త్ర ఉల్లంఘన, ఆధ్యాత్మికత, దేవుడి ఉక్రోషాన్ని వెతకడం బూర్జువా రాజకీయ పార్టీలకు మాత్రమే సాధ్యం. అందుకు నిదర్శనం ఇటీవల ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో జరిగిన ఓ భారీ అగ్నిప్రమాదం.

తిరుపతి ఆధ్యాత్మికనగరం ప్రపంచ ప్రసిద్దిగాంచిన యాత్రా స్థలం. ఇక్కడికి దేశ నలుమూలల నుంచే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా నిత్యం లక్షలాది మంది సందర్శకులు రాకపోకలు సాగిస్తుంటారు. తిరుపతిలో ప్రవేశించగానే వారికి మొట్టమొదట అగుపించే ఆలయం శ్రీగోవిందరాజుస్వామి ఆలయం. తిరుపతి స్మార్ట్ రైల్వేస్టేషన్‌కు కూతవేటు దూరంలో పట్టుమని వందమీటర్లు దూరంలోనే ఈ ఆలయం ఉంటుంది. టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి దర్శనానికి వచ్చే భక్తులు ముందుగా శ్రీగోవిందరాజుస్వామిని దర్శించుకుంటారన్నది ప్రతీతి. అలాంటి గోవింద రాజుస్వామి ఆలయం ఇటీవల తరుచూ వార్తల్లో నిలుస్తోంది. అందుకు బూర్జువ రాజకీయాలే వేదిక కావడం గమనార్హం. ఈ నెల 16వ తేదిన తిరుపతిలోని శ్రీగోవిందరాజుస్వామి ఆలయం దక్షిణ మాఢవీధిలో ఉన్న లావణ్య ఫ్రేమ్స్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. లావణ్య ఫ్రేమ్స్ అంటే రాష్ట్ర వ్యాప్తంగానే కాదు, దేశ వ్యాప్తంగానూ సుపరిచితమే. ఇందులో తయారయ్యే శ్రీవెంకటేశ్వరస్వామి, ఆలిమేలుమంగమ్మ, గోవిందరాజస్వామి, కోదండ రామస్వామి, కపిలేశ్వరస్వామి తదితర దేవుళ్ల ఫోటోల ఫ్రేమ్స్ తిరుపతికి వచ్చే ప్రతి విఐపికీ అందుతాయంటే అతిశయోక్తి కాదు. దేశవ్యాప్తంగా లావణ్య ఫోటో ఫ్రేమ్‌తో కూడిన విఐపి గృహం లేని రాష్ట్రం ఉండదు. అంతటి ప్రాముఖ్యతగల్గినది. అలాంటి ఫోటోఫ్రేమ్ షాపు గోవిందరాజుస్వామి దక్షిణ మాఢవీదిలో ఉంది. ఈ నెల 16వ తేది ఉదయం 10 గంటల ప్రాంతంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల నాలుగు అంతస్తులు గల ఆ షాపులో అగ్నిప్రమాదం సంభవించింది. ప్రమాదాన్ని గమనించిన సిబ్బంది, వినియోగదారులతో సహ హుటా హుటీన బయటకు పరుగులు తీశారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు సుమారు ఏడు ఫైర్ ఇంజన్లతో అగ్నిమాపక సిబ్బంది కృషి చేసి ఎట్టకేలకు మంటలను అదుపులోకి తీసుకురాగలిగారు. ఈ ప్రమాదంలో 25 కోట్ల మేరకు ఆస్థినష్టం సంభవించిందన్నది బాధితుల ఆవేదన. ఇది ఉద్దేశపూర్వకంగా జరిగిందా... ప్రమాదవశాత్తు జరిగిందా అనేది పక్కన పెట్టి. దేవుడి ఆగ్రహం వల్లే ఇలా జరిగిందన్న కొత్త ప్రచారాన్ని బూర్జువా రాజకీయ పార్టీలు తెరమీదకు తేవడం కొసమెరుపు. ఈ ప్రమాదం జరగడానికి వారానికి ముందే ఆదే గోవిందరాజు స్వామి ఆలయంలో వానగాలికి ఓ భారీ చెట్టు కొమ్మ విరిగిపడి ఓ డాక్టర్ మృతి చెందాడు. అది జరిగిన వారానికి ఈ అగ్నిప్రమాదం జరగడంతో ఈ రెండిటికి ముడిపెట్టి ప్రతిపక్ష పార్టీ అధికార పార్టీపై విమర్శలు గుప్పించడం, అందుకు వారు తిరిగి కౌంటర్ విమర్శలు చేయడం సర్వసాధారణమైంది. ఆలయంలో చెట్టు కొమ్మ విరిగి వ్యక్తి చనిపోవడం చాలా పాతకమని, అందుకు అధికార పార్టీ చేస్తున్న అరచకాలే కారణమని, దానికి ఎలాంటి శాంతి పూజలు చేయకపోవడంతోనే దేవుడు అగ్రహం చెంది, ఆలయానికి ఈశాన్య ప్రాంతంలో అగ్నిదేవుడు అగ్రహోదుడైనాడని చెప్పడం హాస్యాస్పదం. దీనికి అధికార పార్టీ తామంత ఆగమశాస్త్రం ప్రకారమే నడుచుకుంటామని ఆగమాన్ని అడ్డం పెట్టుకుని ఆగం ఆగం చేయడం గమనార్హం. ఏది ఏమైనా ప్రమాదానికి గల కారణాలు, అందుకు కారకులు ఎవ్వరు, అలాంటివి ముమ్మందు జరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాదితులను ఆదుకోవడం తదితర వాటిపై చర్చలు జరగకుండా అంతా ఆగమశాస్త్రంపై నెట్టేయడానికి నేటి బూర్జవ రాజకీయ పార్టీలు పథకం వేయడం పలువురు మేధావులను విస్మయానికి గురి చేస్తోంది. ఇప్పటికైనా ఇలాంటివి మానుకుని, వాస్తవాలను వెలికితీసి, బాధితులను ఆదుకునేందుకు కృషి చేయాలని పలువురు కోరుకుంటున్నారు.



'జగనన్న సురక్ష' ను విజయవంతం చేద్దాం

● రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా ● వడమాలపేట మండలంలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని ప్రతిఒక్కరూ సమిష్టిగా విజయవంతం చేయాలని రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. నగరిలోని కల్యాణ మండపంలో జగనన్న సురక్ష కార్యక్రమం అమలుపై పుత్తూరు మున్సిపాలిటీ, పుత్తూరు రూరల్, వడమాలపేట మండలాల సచివాలయం కన్వీనర్లు, గహ సారధులు, ప్రజా ప్రతినిధులకు శనివారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం అద్భుతమని.. అందరూ ఓ బాధ్యతగా తీసుకొని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలో ఎవరూ చేయని విధంగా ధైర్యంగా ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రతి గడపకు వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారని.. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఇంటి వద్దకే అధికారులు వెళుతున్నారని తెలిపారు. ప్రజల కష్టాలను తన కష్టాలుగా భావించి వాటిని దూరం చేస్తూ కోవిడ్ సమయంలో ప్రజలకు అండగా నిలబడిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ హరి, వైస్ ఛైర్మన్ జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు, ఎంపీపీ మునివేలు, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గూడూరు టౌన్: వాలంటీర్లు, సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని జగనన్న సురక్ష కార్యక్రమ లక్ష్యాన్ని పూర్తి చేయాలని గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు సచివాలయ సిబ్బందికి సూచించారు. శనివారం గూడూరు పట్టణంలోని డి.ఆర్.డబ్ల్యు మహిళా కళాశాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎమ్మెల్యే వరప్రసాద్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. వాలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి అర్హులై ఉండి సంక్షేమ పథకాలు రాకపోతే వారి సమస్యను పరిష్కరించాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ దేవసేనమ్మ, కమిషనర్ సాయినాథ్, డీపీవో వాణిరెడ్డి, నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, అజీజ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బాలాయపల్లి : జగనన్న సురక్ష పథకం విజయవంతం చేసేందుకు సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పనిచేయాలని ఎంపీడీవో రవీంద్రబాబు అన్నారు. శనివారం మండలంలోని మన్నూరు సచివాలయంలో జగనన్న సురక్ష పథకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రతిఇంటిని వాలంటీర్లు, సచివాలయం సిబ్బంది కలిసి సందర్శించాలని.. ప్రభుత్వం నుంచి అందే సంక్షేమ పథకాలు నేరుగా అందేలా ప్రత్యేకమైన చర్యలు చేపట్టాల్సిన బాధ్యత ఉందన్నారు. కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వాలంటీర్లు ఉంటే వేటు తప్పదని హెచ్చరించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాల సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

పెళ్లకూరు: పెళ్లకూరు మండలంలోని తాళ్లాయిపాడు గ్రామంలో శనివారం మండల రెవెన్యూ అధికారి ఎస్.రామయ్య ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై సచివాలయ సిబ్బంది, వాలంటీర్లకు సలహాలు, సూచనలు అందించారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న జగనన్న సురక్ష పథకం ద్వారా అవసరమైన తొమ్మిది రకాల సర్టిఫికెట్లను ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరగా పొందవచ్చని.. గ్రామంలో ఉండే ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీడీవో సురేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి జనార్ధన్, వసంత కుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.



కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

వడమాలపేట: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా కలెక్టరు వెంకటరమణారెడ్డి వడమాలపేట మండలంలోని పాదిరేడు గ్రామంలో ఆకస్మికంగా తనిఖీ చేసి ఇంటింటి సర్వేలో పాల్గొని ప్రజలతో మాట్లాడారు. పథకాలు అందని వారి వివరాలు సేకరించి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీవో భానుమూర్తిరావు, మండల తహాశీల్దార్ సుబ్రమణ్యం, ఏఈ లక్ష్మీ నరసింహులు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, మార్కెట్ వైస్ ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు క్రిస్మస్ కానుక ఇచ్చాం

'యువగళం' పాదయాత్రలో నారా లోకేష్



ప్రజాశక్తి - ఓజిలి (తిరుపతి జిల్లా): క్రైస్తవులకు క్రిస్మస్ కానుక ఇచ్చి ఆదుకున్నది టిడిపి ప్రభుత్వమని యువగళం అధినేత నారా లోకేష్ అన్నారు. యువగళం పాదయాత్ర వెంకటగిరి నియోజకవర్గం మీదుగా 135వ రోజు ఓజిలి మండలంలోని వజ్జావారిపాళెం గ్రామానికి శుక్రవారం రాత్రి చేరుకుంది. శనివారం మధ్యాహ్నం చర్చి ఫాస్టర్లతో సమావేశమయ్యారు. వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ 2014లో రాష్ట్ర విభజనను ఆంధ్రులు కోరుకోలేదని, కట్టుబట్టలతో మెడపట్టుకుని గెంటేశారని, ఆనాడు రాష్ట్రం కష్ట పరిస్థితుల్లో 16వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ఉన్నా ప్రజలకు ఏ ఇబ్బంది లేకుండా నారా చంద్రబాబునాయుడు పాలించారన్నారు. క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ కానుక అందజేశారన్నారు. వైసిపి అధికారం చేపట్టిన తరువాత క్రైస్తవ సోదరుల అభ్యున్నతిని విస్మరించిందన్నారు. వజ్జావారిపాళెం నుంచి పాదయాత్ర తిరుమలపూడి, మాచవరం, ముమ్మాయిపాళెం, కోనేటిరాజుపాళెం రోడ్డు మీదుగా మేనకూరు వరకు యాత్ర చేరుకుంది. నాయుడుపేట మండలం మేనకూరులో శనివారం రాత్రి నారా లోకేష్ బస చేయనున్నారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కొండేపాటి గంగా ప్రసాద్ ,అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, మాజీ ఎంపీ జేసీ దివాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పరసా వెంకటరత్నం , నెలవల సుబ్రహ్మణ్యం , మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు , పాదర్తి ప్రకాష్ నాయుడు ,రాయిపునేని సతీష్ నాయుడు పాల్గొన్నారు. స్థానిక నాయకులు నారా లోకేష్‌ను కలిసేందుకు అనుమతి కోరడంతో వ్యక్తిగత భద్రతా సిబ్బంది అడ్డంకుల చెప్పడంతో కొంతసేపు వాగ్వివాదం చోటు చేసుకుంది.

'విద్యాహక్కు చట్టం'పై అవగాహన కల్పించాలి




ప్రజాశక్తి - తిరుపతి టౌన్: విద్యా హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సత్య కాంత్ కుమార్ అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో విద్యా హక్కు చట్టం, కార్మిక నిషేధ, నియంత్రణ చట్టం గురించి విద్యా శాఖ, కార్మిక శాఖ సంయుక్త ఆధర్వంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ... భారత రాజ్యాంగం ఆర్టికల్ 21ఏ ప్రకారం 2009 విద్య హక్కు చట్టం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. 6 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపు వయసు కలిగిన బాలబాలికలందరూ ఉచిత నిర్బంధ విద్యను అభ్యసించాలనే నిబంధన విద్యా హక్కు చట్టం మన భారత రాజ్యాంగం కల్పించిందన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శేఖర్ మాట్లాడుతూ.. విద్య ద్వారానే సమాజం అభివద్ధి చెందుతుందని అన్నారు. విద్యాహక్కు చట్టం ద్వారా 25 శాతం సీట్ల కేటాయింపును పేద విద్యార్థులకు కల్పించే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరానికి గాను 25 శాతం కేటాయింపుకు సంబంధించి 1003 విద్యార్థులకు గాను 863 మంది విద్యార్థులు వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో జాయిన్ అయ్యారని తెలిపారు. అసిస్టెంట్ లేబర్ కమిషనర్ మాట్లాడుతూ... పిల్లలకు తమ తల్లిదండ్రులు నైతిక విలువల పట్ల అవగాహన పెంచి మంచి పౌరులుగా తీర్చిదిద్దేలా చూడాలని తెలిపారు. 18 సంవత్సరాల బడి బయట ఉన్న బాల బాలికలను గుర్తించి వారిని బడిలో ఉండేలా చర్యలు చేపట్టడం, బాల్య వివాహాల నిర్మూలనకు కషి చేయాలన్నారు. పిల్లలను పనిలో పెట్టు కొంటె ఆ వ్యవస్థ పైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ సమావేశంలో విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు లక్ష్మీనారాయణ, రమణారావు, అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ శివశంకర్, ఐ సి డి ఎస్ లీగల్ ఆఫీసర్ వెంకటేష్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: జగనన్న ఇంటి నిర్మాణాల్లో పురోగతి సాధించి, జగనన్న ఇళ్ళను గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని హౌసింగ్, ఇంజనీరింగ్ అధికారులకు తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో మునిసిపల్ ఇంజనీర్లు, హౌసింగ్ అధికారులతో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఐఎఎస్ శనివారం సమావేశం నిర్వహించారు. జగనన్న ఇంటి నిర్మాణాలపై వారం వారం సమిక్షలు నిర్వహించడం, అధికారులు పనులను వేగవంతం చేస్తామని చెప్పడం చేస్తున్నారే గాని, చెప్పినంతలో పనులు ముందుకెళ్లడం లేదని కమిషనర్ హరిత అసహనం వ్యక్తం చేసారు. జూలై నెలలో గహ ప్రవేశాలకు జగనన్న ఇళ్ళ నిర్మాణాలను అనుకున్న మేరకు సిద్ధం చేయాలని స్పష్టంగా చెప్పినా ఇంత వరకు అనుకున్న మేరకు లక్ష్యాలను పూర్తి చేయకపోవడం తగదన్నారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని చిందేపల్లి, జీపాళెం, కల్లూరు, ఎం.కొత్తపల్లి, సూరప్పకశం, టిసి.అగ్రహారం ప్రాంతాల్లో నిర్మిస్తున్న జగనన్న ఇంటి నిర్మాణ లే అవుట్లలో నిర్మాణల వారిగా ఏఏ దశల్లో వున్నాయో చర్చిస్తూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్మిస్తున్న జగన్న నిర్మాణాలను వేగవంతం చేసి జూలై 17 కల్లా తమకిచ్చిన లక్ష్యాల మేరకు ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేయవల్సిందేనని కమిషనర్ హరిత ఆదేశాలు జారీ చేసారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, హౌసింగ్ పి.డి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జగనన్నపై అమృత వర్షం : భూమన



తిరుపతి టౌన్ : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై ప్రతిపక్ష నేతలైన చంద్రబాబు, పవన్‌కల్యాణ్ పనిగట్టుకుని విషం చిమ్ముతుంటే, ప్రజలంతా నిండు మనస్సుతో అమృత వర్షం కురిపిస్తున్నారని తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఒకటో డివిజన్‌లో నిర్వహించారు. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న మంచికి, ఆయన చేస్తున్న సంక్షేమ అభివృద్ధికి తామంతా ఓటు వేస్తామని ప్రజలందరూ ముక్తకంఠంతో చెబుతున్నారన్నారు. ప్రతిపక్షాలను ఓటుతో చావు దెబ్బతీసి, గుణపాఠం చెప్పాలన్నారు.

29న బక్రీద్ వేడుకలు

తిరుపతి(మంగళం): ఈనెల 29వ తేదీ తిరుపతి నగర పరిధిలోని ఎస్వీ యూనివర్సిటీ సమీపంలో ఉన్న ఈద్గా మైదానంలో బక్రీద్ పర్వదిన పండుగ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించు కుంటున్నామని తిరుపతి ఈద్గా దర్గా అధ్యక్షులు షేక్ ఖాదర్ బాషా తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్భంగా తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి సొంత నిధులతో నమాజ్ కు హాజరయ్యే ముస్లింలకు ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ వారు బక్రీద్ పండుగకు వారి సహకారాన్ని అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ సభ్యులు షేక్ ఇమామ్ సాహెబ్, రఫీ హిందుస్తానీ, మాలిక్, సలీం పాల్గొన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాలు పంపిణీ



తిరుపతి(మంగళం): తిరుపతి నగర పరిధిలోని సంజయ్ గాంధీ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో నందనం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకటో తరగతి నుండి 5వ తరగతి విద్యార్థులు 225 మందికి రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. ధనంజయల్ నాయుడు మాట్లాడుతూ జగనన్న విద్యా కానుక ద్వారా పాఠశాలల్లోని విద్యార్థులందరికీ పాఠ్య పుస్తకాలతో పాటు వర్క్ బుక్కులను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ప్రభాకరరాజు, భాస్కర్ నాయక్, నందనం ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ పత్తిపాటి వివేక్, శివాజీ, జగదీష్ కుమార్, నాదముని, రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'బందీ' చిరుతను అడవిలో వదిలేస్తాం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల అలిపిరి కాలినడక మార్గంలో గురువారం బాలుడిని గాయపరిచిన చిరుతను ప్రత్యేక ప్రణాళికతో బోనులో బంధించామని, చిరుత ఆరోగ్యంపై జూ వెటర్నరీ అధికారులు ఇచ్చే సూచనలతో సురక్షిత అటవీ ప్రాంతంలో విడిచిపెడతామని జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్ తెలిపారు. వేలాదిమంది వెళ్లే అలిపిరి నడక మార్గంలో బాలుడుపై చిరుత దాడి చేయడంతో వెంటనే అటవీశాఖ అధికారులు అప్రవత్తమై బాలుడిని విడిచిపెట్టిన ప్రాంతంలో దాదాపుగా 100 ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి సమీప అటవీ ప్రాంతాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రెండు బోన్లను ఏర్పాటు చేయడంతో శుక్రవారం రాత్రి చిరుత బోనులో చిక్కింది. ఓ పిల్లిని తరుముకొచ్చిన చిరుత కాలినడక మార్గం సమీపానికి వచ్చి అక్కడ బాలుడిని నోటికి కరుచుకుని లాక్కెళ్లిందని, ఇప్పుడు బోనులో చిక్కిన చిరుత కూడా అదేనని భావిస్తున్నామన్నారు. జూ వెటర్నరీ అధికారులు బోనులో చిక్కిన చిరుత ఆరోగ్యాన్ని పరిశీలించి ఇచ్చే సూచనలతో త్వరలో సురక్షిత అటవీ ప్రాంతంలో చిరుతను విడిచిపెడతామని తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్ 'ప్రజాశక్తి'కి తెలిపారు.

ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలు పూర్తవ్వాలి



తిరుపతి టౌన్ : జిల్లాలో జరుగుతున్న రెండవ విడత రి సర్వే పనులు పకడ్బందీగా జరిగేలా చూడాలని నిర్దేశించిన సమయానికి పూర్తి కావాల్సి ఉంటుందని జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి అమరావతి నుండి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలను సమీక్షించగా జిల్లా కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ జెసి డీకే బాలాజీ హాజరయ్యారు. అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తూ రీ సర్వే మొదటి విడతలు 74 గ్రామాలు పూర్తి చేయగలిగామని అందులో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టడానికి అవగాహన కల్పించాలని అన్నారు. రైతు భరోసా కేంద్రాలు సెప్టెంబర్ 30 నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. అలాగే విలేజ్ హెల్త్ క్లినిక్ లు డిసెంబర్ నాటికి పూర్తిచేసేలా పనులు వేగవంతం చేయాలని నిధులకు ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. ఈ సమీక్షలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి జయరాజ్, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీర్ శంకర్ నారాయణ, డిపిఓ రాజశేఖర్ రెడ్డి, డి ఎల్ డి వో లు సుశీల దేవి, ఆదిశేషారెడ్డి పాల్గొన్నారు

చెంగాలమ్మ సేవలో హైకోర్టు జడ్జి



ప్రజాశక్తి - సూళ్లూరుపేట/ తడ: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి వి.సుజాత సూళ్లూరుపేట శ్రీ చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారిని శనివారం దర్శించుకొన్నారు. వారిని కార్యనిర్వహణాధికారి ఆళ్ళ శ్రీనివాస రెడ్డి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వేదపండితులచే పూజలు నిర్వహించి అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఈ కార్యక్రమములో జిల్లా ఎసిబి జడ్జి జయలక్ష్మి, ఆర్డీవో చంద్రముని,న్యాయ మూర్తులు యస్.అనిల్ కుమార్, యస్.అనూష, తహసీల్దార్ కె.రవికుమార్, ఎస్సై రవిబాబు, తడ ఎస్సై శ్రీనివాస రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఇరకం దీవిలో పోన్నియమ్మన్ దేవాలయాన్ని దర్శించుకున్నారు. భీమునివారిపాళెం నుంచి పడవ సాయంతో పులికాట్ సరస్సు మీదుగా ఇరకం దీవికి చేరుకున్న ఆమె గ్రామస్తుల సాయంతో ట్రాక్టర్లలో ఎక్కి ఆలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఒ శామ్యూల్, తడ తహశీల్దార్ కటారి జయజయరావు, తడ ఎస్ఐ జేపి శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

తిరుమల బస్సుల్లోనూ ప్లాస్టిక్ నిషేధం



ప్రజాశక్తి - తిరుమల: రుమలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లోనూ గార్బేజ్ బ్యాగులు ఏర్పాటుచేసి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించేందుకు ఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. తిరుపతిలోని శ్రీ పద్మావతి విశ్రాంతి గహంలో శనివారం సీనియర్ అధికారులతో ఈవో సమీక్ష నిర్వహించారు. ఈవో మాట్లాడుతూ ఘాట్ రోడ్లు, నడకదారుల్లో రోడ్డుకు ఇరువైపులా ప్లాస్టిక్ వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. తిరుపతిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న శ్రీనివాస సేతు పనులను పూర్తి చేసేందుకు రైల్వే అధికారులు, స్మార్ట్ సిటీ అధికారులతో సమన్వయం చేసుకోవాలని చీఫ్ ఇంజినీర్ ను ఆదేశించారు. ఎస్వీబీసీలో ప్రసారం చేసేందుకు వీలుగా "వేద విజ్ఞాన తరంగిణి" పేరుతో ఎస్వీ వేద విశ్వవిద్యాలయంలో రూపొందిస్తున్న ఎపిసోడ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా సోషల్ మీడియాలో ప్రసారం చేసేందుకు ఎస్వీబీసీ రూపొందిస్తున్న "భారతీయ విజ్ఞాన ధార" కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. టీటీడీ పరిధిలోని అన్ని ఆసుపత్రుల్లో రోగులకు, సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందించేందుకు క్యాంటీన్లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమీక్షలో జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, ఎస్వీబీసీ సీఈవో షణ్ముఖ్ కుమార్, ఎఫ్ఏసిఎఓ బాలాజీ, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, స్విమ్స్ ఉపకులపతి డాక్టర్ వెంగమ్మ, వేదవర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, చీఫ్ ఆడిట్ ఆఫీసర్ శేష శైలేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌లో కల్వర్టును ఢీకొన్న కారు

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రజాశక్తి - తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్ వినాయక గుడి వద్ద కారు అదుపు తప్పి పక్కనున్న కల్వర్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తమిళనాడుకు చెందిన ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. దీంతో కాసేపు వాహనాలు నిలిచి పోయాయి. సమాచారం అందుకున్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ప్రమాదం ఎలా జరిగిందన్న దానిపై పోలీసులు ఆరా తీస్తున్నారు. మరో కారు ప్రమాదంలో డ్రైవర్ కునుకు తీయడంతో కల్వర్టును ఢీకొంది.ఈ ప్రమాదంలో ఇరువురికి స్వల్పగాయలయ్యాయి.

రూ.1.33 కోట్ల సామగ్రి స్వాధీనం

- ముగ్గురి అరెస్టు



ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుపతి రూరల్ మండలం చెన్నాయగుంట గ్రామం వద్ద కొత్త సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఉంచిన రూ.1.33 కోట్ల విలువైన మెటీరియల్ దొంగతనం మిస్టరీని ఎట్టకేలకు తిరుచానూరు పోలీసులు ఛేదించారు. డీఎస్పీ యశ్వంత్ పర్యవేక్షణలో జరిగిన ఆపరేషన్‌లో ప్రవీణ్ ప్రాపర్టీస్ వద్ద మెటీరియల్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వెంటనే టీమ్‌తో రైడ్ చేసి ముగ్గురు ముద్దాయిలను అరెస్టు చేసి ఐదు లారీల సరుకును స్వాధీనం చేసుకున్నారు. తిరుచానూరు పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ యశ్వంత్ వివరాలు వెల్లడించారు.

శ్రీవాణి ట్రస్ట్ నిధులను టీటీడీనే ఖర్చు చేయాలి



ప్రజాశక్తి - తిరుపతి టౌన్ : భక్తులు ఎంతో భక్తి భావంతో తిరుమల తిరుపతి దేవస్థానానికి చెల్లిస్తున్న శ్రీవాణి పథకానికి వచ్చే నిధులను టీటీడీ ద్వారానే ఖర్చు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానంలో సమరసత ఫౌండేషన్ ద్వారా కోట్లాది రూపాయలను ఖర్చు చేయటాన్ని తప్పుపట్టారు. శ్రీవాణి ట్రస్టు నిధుల వినియోగంపై వస్తున్న విమర్శలను ఎదుర్కోవడానికి బదులుగా టీటీడీ విహెచ్ పి, ఆర్ఎస్ఎస్ లను వినియోగించడం సరైంది కాదని విమర్శించారు. వీటి జోక్యం వల్ల టిటిడి తనకున్న ప్రతిష్టను కోల్పోతుందని హెచ్చరించారు. టిటిడి యాజమాన్యం ఇది గుర్తించకపోతే తీవ్రమైన వివాదాలకు కేంద్రంగా మారుతుందని అన్నారు నిధుల. వినియోగంలో టీటీడీ పారదర్శకంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.

ఆరోగ్య సంరక్షణకు రక్త పరీక్షలు



క్యాంపస్ : 'చంద్రగిరి నియోజకవర్గంలో ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా అందరికంటే ముందుగా నేనున్నాను అంటూ భరోసా కల్పించే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం విషయంలో అంతే ముందు చూపును ప్రదర్శించారు' అని చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి వెల్లడించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం చంద్రగిరి మండలం పరిధిలోని చిన్నరామాపురం, కందులవారిపల్లి, ఎ.రంగంపేట, రామిరెడ్డి పల్లి, బందార్లపల్లి, కొటాల, పుల్లయ్యగారిపల్లి ప్రాంతాల్లో జరిగే ఆరోగ్య శిబిరాలను పర్యవేక్షించారు. భోజనం, త్రాగునీరు వసతులపై స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో చర్చించారు.


26, 27 తేదీల్లో కేంద్రమంత్రి సెహ్వాగ్ పర్యటన

కోట : కేంద్ర ఐటి సహాయ మంత్రివర్యులు సెహ్వాగ్ 26, 27 తేదీల్లో గూడూరు నియోజకవర్గంలో పర్యటించనున్నారు. చిల్లకూరు మండలం పారిచర్లవారిపాలెంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తారని బిజెపి ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు తెలిపారు. అలాగే హోటల్లో 9.30 గంటలకు మోడీ తొమ్మిదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతాన్ని వివరిస్తారు. తూపిలిపాలెంలో ఉన్న సమాచార కేంద్రాన్ని తనిఖీ చేయనున్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని బహుదూర్ పేట నల్ల గంగమ్మ గుడి ఆలయ ప్రాంగణంలో ఆదివారం శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్, ఎంజిఎం ఆస్పత్రి సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామేష్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాధారణ వ్యాధులతోపాటు గుండె, ఎముకలు, చిన్నపిల్లలకు సంబంధించిన స్పెషలిస్ట్ డాక్టర్లు ఈ శిబిరంలో పాల్గొంటారనీ, బహుదూర్ పేట ప్రాంతవాసులు శిబిరంలో పాల్గొని ఉచితంగా వైద్య సేవలు పొందాలని కోరారు.

జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ ప్రారంభం



క్యాంపస్ : తిరుపతి పట్టణంలోని గిరిజన భవన్ నందు 12వ జాతీయ స్థాయి తొంగ్-ఇల్-మూ-డో మార్షల్ ఆర్ట్స్ 2కె23 ఛాంపియన్‌షిప్ పోటీలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు 13 రాష్ట్రాల నుంచి దాదాపు 150 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్కై అండ్ స్నోబోర్డ్ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మహ్మద్ అర్షద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోలర్ స్కై అసోసియేషన్ అధ్యక్షులు సీ.వెంకట ప్రసాద్, రాష్ట్ర రోలర్ స్కై అసోసియేషన్ ఛైర్మన్, విశ్వం స్కూల్స్ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, రాష్ట్ర గ్రాపిలింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సురేంద్రరెడ్డి, తిరుపతి ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు, ఇంటర్నేషనల్ అథ్లెట్ ఆంజనేయులు నాయుడు పాల్గొన్నారు.